క్లుప్తంగా

విజయదశమి ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉప్ప సర్పంచ్ రామనాయుడు, తదితరులు

పాడేరు రూరల్: పాడేరు జిల్లా కేంద్రంలో ఈ నెల 29 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు నిర్వహించనున్న విజయదశమి ఉత్సవాల పోస్టర్‌ని ఉప్ప పంచాయతీ సర్పంచ్ బూరెడ్డి రామనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు, స్థానిక వర్తక వ్యాపారుల ఆధ్వర్యంలో వైభవంగా వేడుకలు నిర్వహించ నున్నట్టు ఆయన చెప్పారు. భక్తులు తరలివచ్చి దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఉత్సవ కమిటీ నాయకులు వెంకట రమణ, శ్రీను, గణేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

22వ తేదీలోగా ప్రవేశాలు పొందాలి



విజయభారతి

చింతపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థులు ఈ నెల 22తేదీలోగా జాయిన్ కావాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు.2025–26 తొలి విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు జాబితాను విడుదల చేయడం జరిగిందన్నారు.ఈ నెల 22తేదీ లోపు విద్యార్థులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో కళాశాలకు వచ్చి తమకు కేటాయించిన సీట్లలో ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువత

ఎటపాక: రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేసేందుకు యువత ముందుకు రావాలని బీజేపి మండల అధ్యక్షుడు నలజాల శ్యామ్ ప్రసాద్ అన్నారు. మోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం నెల్లిపాక పీహెచ్‌సీ ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సారథ్యంలో పలువురు యువత రక్తదానం చేశారు. డాక్టర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమవుతుందని ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. బీజేపీ నాయకులు సతీష్‌కుమార్ నాయక్, దుర్గారావు, వెంకటేష్, ప్రసాద్, రమేష్, అశోక్ తదితరులున్నారు.

ఆత్మీయ సన్మానం



సిబ్బందిని సన్మానిస్తున్న వైద్యధికారులు నజీబ్, కుమార్‌రత్న

దుంబ్రిగుడ: మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇటీవల బదిలీపై వెళ్తున్న వైద్య సిబ్బందికి వైద్యాధికారులు నజీబ్, కుమార్‌రత్నల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. అలాగే బదిలీపై వచ్చిన నూతన సిబ్బందికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ఇక్కడ విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న వారి సేవలను కొనియాడారు. అలాగే బదిలీపై వచ్చిన నూతన సిబ్బంది అంతే అంకితభావంతో పనిచేయాలని కోరారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పథకం పనులకు భూమిపూజ



చేతిపంపు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

కూనవరం: మండలంలోని చినార్కూరు పంచాయతీ పంద్రాజుపల్లి గ్రామంలో తాగునీటి పథకం పనులకు ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్ సున్నం అభిరామ్ శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ గ్రామ పంచాయతీ నిధులతో స్థానికంగా ఉన్న వాటర్ ట్యాంకు నుంచి పైపు లైన్ ద్వారా ఇంటింటికీ కొళాయి ద్వారా నీటి సరఫరా జరగనున్నట్టు చెప్పారు. అలాగే చినార్కూరులో చిచ్చడి వారి గుంపు ప్రాంతంలో చేతి పంపు ఏర్పాటుచేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి రోజ, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు సోడె ముత్తయ్య, చిచ్చడి నాగలక్ష్మి, నాగయ్య, పాపారావు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటికి కటకట

- గెడ్డనీరే శరణ్యం
- ప్రబలుతున్న రోగాలు
- పట్టించుకోని అధికారులు



మర్రిదాటులో గెడ్డనీటిని సేకరిస్తున్న స్థానికులు



వల్లిపనస గ్రామంలో ఊట నీటిని సేకరిస్తున్న గిరిజన మహిళలు

అరకులోయటౌన్: గిరిజన గ్రామాల్లో ఏడాది పొడవునా గిరిజనులు తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. తాగునీటి సౌకర్యాలున్న పట్టించుకోని అధికారులు, తాగునీటి ఏర్పాటుకు సౌకర్యాలు లేని చోట్ల తాగునీరందిస్తామని హడావుడిగా పనులు చేపట్టి అధికారులు ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తున్నారని ప్రజాప్రతినిధులు, గిరిజనులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి తాగునీటి సమస్యతో సతమతమవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక తాగునీటి సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక గెడ్డ నీటిని వినియోగిస్తున్నామని వాపోతున్నారు. ఊటనీటిని సేకరించి వినియోగించి రోగాల బారినపడుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి ఆయా గ్రామాల్లో తాగునీటి కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

- అరకులోయ మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో 237 బోర్‌వెల్‌లు ఉండగా వాటిలో 207 బోర్లు పనిచేస్తున్నాయి. 30 బోర్లు పని చేయడం లేదు. 32 గ్రావీటీల ద్వారా నీరందించే ట్యాంకులు పనిచేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి తాగునీటి కల్పనకు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

పెదబయలు: మండలంలోని మారుమూల కుంతుర్ల పంచాయతీ మర్రిదాటు గ్రామానికి వెళ్లడానికి రహదారి లేక ఆదివాసీ గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు మనుగూరు బాబుజీ అన్నారు. మర్రిదాటు గ్రామంలో వెళ్లి అక్కడ సమస్యలను గ్రామ ప్రజలతో మాట్లాడి తెలుసుకున్నారు. గ్రామంలో 30 పీవీటీజి కుటుంబాలు నివసిస్తున్నారు. గ్రామానికి వెళ్లడానికి రోడ్డు సదుపాయం లేదని, గ్రామానికి తాగునీటి పథకాలు లేదని ఊటనీరు.

గెడ్డ నీరు తెచ్చుకుని తాగుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాల లేదని దీంతో 20 మంది విద్యార్థులు బర్దెపుట్టు గ్రామ పాఠశాలకు రెండు కిలోమీటర్లు నడిచి వెళ్తున్నారన్నారు. రెండు గ్రామాల మధ్యలో వాగు ఉందని వర్షాలకు వాగు



మర్రిదాటులో గ్రామస్తులు తాగునీటి కోసం ఆధారపడిన ఊటగెడ్డ ఇదే

పొంగితే విద్యార్థులు బడికి వెళ్లే పరిస్థితి లేదన్నారు. గ్రామానికి రోడ్డు సదుపాయం లేక పీఎం జన్మన్ పథకం ద్వారా గృహాలు మంజూరైన నిర్మాణం చేసుకోలేని పరిస్థితి ఉందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థి సంఘ నాయకులు, గ్రామస్తులు కోరారు.

సెమినార్లతో విద్యార్థులకు మరింత నైపుణ్యం



అవగాహన కల్పిస్తున్న జగదీష్

పాడేరు రూరల్: ప్రత్యేక సెమినార్ తరగతులతో విద్యార్థులకు మరింత నైపుణ్యం కలుగుతుందని సైన్స్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్.జగదీష్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం సెమినార్ ఏర్పాటు చేసి 9, 10 తరగతుల విద్యార్థులకు సైన్స్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యత, శాస్త్రీయ విద్యావిధానంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ అలవార్చుకునే గుణం ఉంటే అన్ని రంగాల్లో చాకచక్యంగా ముందుంటారన్నారు, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ వీడియోల ద్వారా జియోగ్రఫీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ, బయాలజీ తదతర రంగాల్లో శాస్త్రవేత్తల ఆవిష్కరణలను వివరించారు. విద్యార్థులు ఇటువంటి తరగతులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది సలోమి, రత్నశ్రీ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చింతపల్లి: చింతపల్లి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పి.వేణుగోపాలరావు తెలిపారు. ఈ నెల 20న 33 కేవి చింతపల్లి ఫీడర్ లైను మరమ్మతులు చేయనున్నట్టు తెలిపారు.ఈ నేపథ్యంలో చింతపల్లి, జీకే వీధి మండలాల్లోని అన్ని గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలుపదల చేస్తున్నామని, వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

236 మందికి వైద్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన లభించింది.వైద్యశాఖ ఉన్నతారుల ఆదేశాలతో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కిముడు గీతాంజలి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ నిర్వహించారు. త్యేక వైద్య నిపుణులు వాసవి, ప్రభావతి, అనూష, చందనశ్రీ, ధరణిలు రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ముఖ్యంగా గర్భిణులు, చిన్న పిల్లలకు పరీక్షలు చేసి ఆరోగ్య సూత్రాలను తెలియజేశారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 236 మందికి వైద్య సేవలందించారు.రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి వివేక్, సీహెచ్‌సీ, కిలగాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యువత ఉన్నత లక్ష్యాలను సాధించాలి



గాంకొండలో మాట్లాడుతున్న ఎస్‌ఐ కిశోర్‌వర్మ

కొయ్యూరు: జీవితంతో ఉన్నత లక్ష్యాయలను పెట్టుకుని వాటిని సాధించేందుకు యువత సిద్ధం కావాలని కొయ్యూరు ఎస్‌ఐ కిషోర్‌వర్మ సూచించారు. ఆయన శుక్రవారం బట్టపనుకుల పంచాయతీ గన్నెర్లపాలెం, నడింపాలెం పంచాయతీ శివారు గాంకొండలో ఆయన గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువత వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలు చెప్పిన సమస్యలను ఆయన నమోదు చేసుకున్నారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టిలో ఉంచి పరిష్కరిస్తామన్నారు.

అంబులెన్స్ కోసం ఎమ్మెల్యేకు వినతి



పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడెంకొత్తవీధి: పెదవలస ఆరోగ్య కేంద్రానికి పూర్తి స్థాయిలో అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ తదితరులు పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును కోరారు.ఈ మేరకు ఆయన శుక్రవారం పాడేరులో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు వినతిపత్రం అందజేశారు. పెదవలస పీహెచ్‌సీకి అంబులెన్స్‌తో పాటు డ్రైవర్ కూడా లేకపోవడంతో పెదవలస, లక్కవరపుపేట, బూదరాళ్ల, దేవరాపల్లి, సంకాడ, రింతాడ పంచాయతీలకు చెందిన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.అంబులెన్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ దేముడు, పెదవలస పంచాయతీ అధ్యక్షుడు కంకిపాటి శ్రీరాములు, మండల ఉపాధ్యక్షులు బాలకృష్ణ, రామారావు, రమేష్, చిన్న భాయి, స్వామినాథం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

సీలేరు: గూడెంకొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని మునసపల్లి గ్రామంలో నిర్మిస్తున్న రహదారి పనులను శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్ రాజు పరిశీలించారు.వలసగెడ్డ కొత్తూరు వద్ద రహదారి నుంచి వలసగెడ్డ, వలసపల్లి మీదుగా మునసపల్లికి రోడ్డు పనులు చేస్తున్నారు. రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. టీడబ్ల్యూ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ప్రసవాలతో సురక్షితం



జర్రెలలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శిరీష



జి.ఎం.కొత్తూరులో మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిశోర్



పర్రెడలో మహిళలకు వైద్య సేవలందిస్తున్న సిబ్బంది



వంతమర్రిలో వైద్య శిబిరంలో మాట్లాడుతున్న వైద్యులు



దుశ్శర్తిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



తంటికొండలోని వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సతీష్

ముంచంగిపుట్టు/పెదబయలు/జి.మాడుగుల/కొయ్యూరు/అడ్డతీగల/రాజవొమ్మంగి: జిల్లా వ్యాప్తంగా స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలను పలు మండలాల్లో శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆరోగ్యభద్రతపై మహిళలు తీసుకోవాల్సిన జాగ్రతలను వివరించారు. వైద్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ గర్భిణులు ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని, దీంతో తల్లి, బిడ్డ సురక్షితంగా ఉంటారన్నా రు. గర్భిణులు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ముంచంగిపుట్టులో వైద్యాధికారి శిరీష, సర్పంచ్ బొరగం భాగ్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గల్లెల అర్జున, సీహెచ్‌వో ఉషారాణి, దీప్తి, ఎంపీహెచ్‌ఈవో వరహాలనాయుడు, పెదబయలులో వైద్యాధికారి పి.సత్యారావు, జి.మాడుగులలో వైద్యాధికారి డాక్టర్ కిశోర్, డాక్టర్ ఇందిర, సర్పంచ్ రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు మత్స్యరాస విజయకుమారి, ఎంపీహెచ్‌ఈవో ప్రకాష్ , కొయ్యూరులో వైద్యుడు హేమంత్ చౌదరి, సీహెచ్‌వో ప్రశాంత్ కుమార్, అడ్డతీగలలో వైద్యాధికారి శివారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు విశ్వకుమారి, సర్పంచ్ నాగరత్నం, రాజవొమ్మంగిలో వైద్యాధికారి సతీష్, సిబ్బంది శ్రీనివాస్, అప్పలనర్స తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ అనర్థాలపై అవగాహన



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, వేదికపై ఈగల్ టీం అధికారులు

గూడెంకొత్తవీధి: మండలంలోని రింతాడ బాలికల ఆశ్రమ పాఠశాలలో చింతపల్లి ఈగల్ టీం శుక్రవారం డ్రగ్స్ అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు డ్రగ్స్ అనర్థాలపై ప్లేకార్డులతో ప్రదర్శన చేశారు. డ్రగ్స్‌తో కలిగే నష్టాలను వివరించారు. ఇన్‌స్పెక్టర్ నాగార్జున మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందడంలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. గంజాయి రవాణాపై సమాచారం ఇచ్చిన పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈగల్ టీం నిర్వహించే ఆపరేషన్లు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు.ఈగల్ టీం ఐజీ రామకృష్ణ, మురళీల ఆదేశాల మేరకు ఇక్కడ అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.

గ్రామ సమస్యలపై స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



రాజవొమ్మంగి పశువుల ఆస్పత్రిపై కూలిన టేకు చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



రాజవొమ్మంగిలోని గిరిజన ప్రాథమిక పాఠశాల ఆవరణను యంత్రాలతో చదును చేస్తున్న దృశ్యం

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని పశువుల ఆస్పత్రిపై దాదాపు రెండేళ్ల క్రితం కూలినభారీ టేకు చెట్టును అధికారులు శుక్రవారం తొలగించారు. చెట్టు కూలిపోవడంతో ఆస్పత్రి పాక్షికంగా దెబ్బతిన్నది. మరో వైపు శ్లాబ్ నుంచి వర్షం నీరు లీక్ అవుతోంది. మండలంలో శిథిలదశకు చేరిన పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల భవనాల దుస్థితిపై 'సాక్షి' సమస్యను వెలుగులోకి తీసుకొచ్చింది. ఇందులో భాగంగా 'నిర్లక్ష్యానికి నిదర్శనం' శీర్షికతో శుక్రవారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. ఈ మేరకు స్థానిక పశువుల ఆస్పత్రి భవనంపై కూలిన చెట్టును యంత్రాల సహాయంతో తొలగించారు. పరిసరాలను కొంతమేర చదును చేశారు. మరోవైపు ఇదే ప్రాంతంలో గల గిరిజన ప్రాథమిక పాఠశాల ప్రాంగణాన్ని హెచ్‌ఎం బిడిజను నూకరాజు పర్యవేక్షణలో యంత్రాల సహాయంతో చదును చేశారు. వర్షం వస్తే ఈ పాఠశాల చుట్టూ నీరు చేరి ఈ ప్రాంతం అంతా చెరువును తలపిస్తోందని, మరోవైపు పాఠశాల చుట్టు పాడుబడిన, శిథిలాస్థితిలో ఉన్న భవనాలు ఉన్నాయని, వీటిని తొలగించాల్సి ఉంటుందన్నారు. ఎత్తుగా పెరిగిన భారీ వృక్షాలను తొలగించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. చెట్లు, పాడుపడిన భవనాల కారణంగా ప్రతిరోజు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నామని హెచ్‌ఎం నూకరాజు, పాఠశాల చిన్నారులున్నారు.

సమస్యలపై జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతి



జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దుంబ్రిగుడ: మండలంలోని సొవ్వ పంచాయతీ కమలబంధ, సాగిరివలస గ్రామాల్లో తాగునీరు సమస్య పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రను పాడేరులో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు పాంగి నరసింగరావు, కొర్ర దొన్ను, రాజు మాట్లాడుతూ గ్రామాల్లో జనాభా పెరగడంతో ప్రస్తుతం ఉన్న గ్రావిటీ నీరు చాలడం లేదని, వేసవి కాలంలో తాగునీరు అందక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తమ గ్రామానికి తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్ప్ పర్సన్ సుభద్ర తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు



క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతి అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్, తదితరులు

అరకులోయటౌన్: కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ మై భారత్ విశాఖపట్నం డివిజన్ ఆధ్వర్యంలో అరకులోయ నిర్వహించిన బ్లాక్ లెవెల్ క్రీడా పోటీల్లో విజేతలకు శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్, మహిళా డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు చేతుల మీదుగా బహుమతులు ధ్రువపత్రాలు అందజేశారు. వాలీబాల్, కబడ్డీ, రన్నింగ్, లాంగ్ జంప్, హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి ధ్రువపత్రం అందజేసినట్లు మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు తెలిపారు. ఎన్ఎస్ఎస్ పీఓలు వై. విజయలక్ష్మీ, పి, నాగబాబు, ఎం. అనిత కుమారి, పీడీలు ఎస్. అప్పారావు, ఎల్.జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు కృషి



లాగరాయి గ్రామంలో ఆది కర్మ అభియాన్ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ గణలక్ష్మి

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయిలో సర్పంచ్ మిరియాల గణలక్ష్మి ఇంటింటికి సుమారు 300 డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. ఆమె శుక్రవారం ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఆది సేవా కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతు ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన తడి, పొడి చెత్త బక్కెట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెత్త ఎక్కడ బడితే అక్కడ డంప్ చేయవద్దని, చెత్త తొలగింపులో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. సచివాలయ సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌ఏల ఆందోళన



రంపచోడవరంలో వీఆర్‌ఏల ఆందోళన

రంపచోడవరం: వీఆర్‌ఏలకు కనీసం వేతనం రూ. 26వేలు ఇవ్వాలని వీఆర్‌ఏల సంఘం అధ్యక్షురాలు తుర్రం చింతాలమ్మ డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం వీఆర్‌ఏలు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు చింతాలమ్మ మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్‌ఏలకు కనీస వేతనం అమలు చేయాలని, అర్హులైన వారికి అటెండర్, వాచ్‌మెన్‌లుగా పదోన్నతి కల్పించాలన్నారు. అనంతరం తహసీల్దార్ బాలాజీ, డీటీ జిలానీలకు వినతిపత్రాన్ని అందజేశారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట డివిజన్‌లో ఉన్న వీఆర్‌ఏలు అందరూ కలిసి ఈ నెల 20న నిరాహార దీక్ష చేసి సబ్ కలెక్టర్‌కు, 22న పాడేరులో నిరాహారదీక్ష చేసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరి



గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సంఘమిత్ర



పసువులబంద గ్రామంలో మాట్లాడుతున్న సిడిపీఓ శ్రీదేవి



రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి, జడ్పీటీసీ వెంకటలక్ష్మి

చింతపల్లి/చింతూరు/రంపచోడవరం: జిల్లా వ్యాప్తంగా పోషణ్ మహా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా వైద్యులు, సీడీపీవోలు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పోషక విలువలున్న చిరుధాన్యాలు, ఆకుకూరలు, కాయగూరలను ఎక్కువగా తీసుకోవాలని, ఉప్పు, పంచదార, నూనెల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. చింతపల్లిలో సీడీపీవో దేవి, చింతూరులో సూపర్‌వైజర్ సంఘమిత్ర, రంపచోడవరంలో ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు వెంకటలక్ష్మి, దేవి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ

సీలేరు/అడ్డతీగల: సీలేరు, అడ్డతీగల ప్రాంతాల్లో రైతులకు యూరియాను శుక్రవారం పంపిణీ చేశారు. సీలేరులో వ్యవసాయాధికారి గిరిబాబు, సర్పంచ్ కుమారి, ఎంపీటీసీ ఉల్లాస్, అడ్డతీగలలో సొసైటీ అధ్యక్షుడు హరిబాబు, సొసైటీ సీఈవో మణిరాజు తదితరులు పాల్గొన్నారు.

21న మెగా వైద్యశిబిరం

రంపచోడవరం: రంపచోడవరంలో రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఈ నెల 21న మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయానంద తెలిపారు. గుండె వ్యాధులు, ఆయాసం, చెవి,ముక్కు, గొంతు , ఎముకలు, ఫిట్స్ వంటి పలు వ్యాధులకు ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అలాగే పరమహంస యోగానంద నేత్రాలయ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరుగుతుందని, అవసరమైన వారు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.